క్లుప్తంగా

6న మండల సమావేశం

కనిగిరి రూరల్: కనిగిరి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6న శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహేష్‌బాబు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరవుతారన్నారు. జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులంతా తప్పక పూర్తి స్థాయి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

సబ్సిడీపై కంది విత్తనాలు సరఫరాకు సిద్ధం

వెలిగండ్ల: సబ్సిడీపై కంది విత్తనాలు సరఫరా చేసేందుకు సిద్ధం చేసినట్లు వ్యవసాయాధికారి ఎస్ రంగాకృష్ణ తెలిపారు. క్వింటా కంది విత్తనాల రేటు రూ.13,980 కాగా ప్రభుత్వం సబ్సిడీ రూ.4,194 పోగా మిగిలిన రూ.9786 రైతులు చెల్లించాలన్నారు. ఎకరాకు 4 కిలోల చొప్పున గరిష్ఠంగా 5 ఎకరాలకు కంది విత్తనాలు పొందవచ్చన్నారు. కంది విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

6న రేబిస్ టీకాలు

లింగసముద్రం (వలేటివారిపాలెం): జూనోసిస్‌డేని పురస్కరించుకుని స్థానిక పశువైద్యశాలలో ఈ నెల 6వ తేదీన పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు పశువైద్యశాల సహాయ సంచాలకుడు కేవీ బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ కిషోర్‌బాబు

సింగరాయకొండ: స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను గురువారం సాయంత్రం ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా రికార్డులు తనిఖీ చేసినట్లు సీఐ రంగనాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ వాణిశ్రీ

సింగరాయకొండ: డయేరియా వ్యాధిపై వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి బాధితులను గుర్తించాలని డీసీఎస్ డాక్టర్ వాణిశ్రీ సూచించారు. మండల కేంద్రంలోని హెల్త్ సెంటర్–2 లో గురువారం స్టాప్ డయేరియాపై చిన్నారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నీళ్ల విరేచనాలవుతున్న చిన్నారులకు జింక్ మాత్రలు వేయడంతో పాటు ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలని సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ చేయూత

కొండపి(సింగరాయకొండ): తల్లి చనిపోయి, తండ్రి మద్యానికి బానిసవడంతో చదువుకు ఇబ్బంది పడుతున్న ఇద్దరు విద్యార్థులకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించింది. జువ్విగుంట గ్రామానికి చెందిన ఇద్దరు ఆడపిల్లలు చదువులో ముందంజలో ఉండేవారు. తల్లి మరణించడం, తండ్రి పట్టించుకోకపోవడంతో వారి విద్యాభ్యాసం ముందుకు సాగడం కష్టంగా మారింది. వారి ప్రతిభను గుర్తించిన ఒక వ్యక్తి ప్రైవేట్ విద్యా సంస్థలో ఉచితంగా చేర్పించారు. అయితే పుస్తకాల ఫీజు కోసం ఇబ్బంది పడుతున్న ఆ చిన్నారులకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ చేయూతనందించింది. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో రౌండ్ వేలం

కొండపి(సింగరాయకొండ): కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నుంచి చుక్క, ముక్క కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. రైతులు తమకు కేటాయించబడిన రోజు వేలానికి బేళ్లు తీసుకురావాలని సూచించారు. 1.00 బ్యారన్‌కు 2 బేళ్లు(300 కేజీలు), 0.84 బ్యారన్‌కు ఒక బేల్(150 కేజీలు), 0.75 బ్యారన్‌కు ఒక బేల్ (150 కేజీలు), 0.63 బ్యారన్‌కు ఒక బేల్(150 కేజీలు), 0.37 బ్యారన్‌కు ఒక బేల్(150 కేజీలు), 0.25 బ్యారన్‌కు ఒక బేల్(125 కేజీలు), 0.13 బ్యారన్‌కు ఒక బేల్(60 కేజీలు)కు మించకుండా వేలానికి తీసుకురావాలని సూచించారు. 2023–24 కాలానికి అనుమతించిన కోటా బ్యారన్‌కు 5 క్వింటాళ్లు మాత్రమేనని స్పష్టం చేశారు.

ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు


అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు


టీఆర్ఆర్ అల్లూరి చిత్రపటానికి నివాళులు

కందుకూరు: మన్యంవీరుడు, స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో అల్లూరి పోషించిన పాత్ర, అందించిన స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. నేటి యువత అల్లూరిలోని పట్టుదల, అంకితభావాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులను కోరారు. చరిత్ర అధ్యాపకులు డి.రామాంజనేయులు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటాలను, అనుసరించిన పద్ధతులను వివరించారు. స్వాతంత్రోద్యం మీద అల్లూరి చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, నరేంద్ర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరు: స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఉద్యాన కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన స్ఫూర్తిని కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ యస్ విజయపద్మ మాట్లాడుతూ విద్యార్థులు అల్లూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన పట్టుదల, సంకల్పం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో అల్లూరి ఎన్నో పోరాటాలను ప్రదర్శించారని, బ్రిటీష్ వారిని గడగడలాడించిన నాయకుడుగా గుర్తింపు పొందారని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు అల్లూరి జీవితం, స్వాతంత్ర పోరాటంలో ఆయన చేసిన సేవలను వివరించి బహుమతులు గెలుచుకున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై యోహాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సీఎస్‌పురం కదిరి బాబూరావు కళాశాలలో అల్లూరి సీతారామరాజుకు నివాళులు

సీఎస్‌పురం(పామూరు): స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీష్ వారికి ఎదురు నిలిచిన ధీరశాలి, విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు అని కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల డీన్స్ డాక్టర్ సున్నా త్రిమూర్తులు, డాక్టర్ పి.వీరన్నగౌడ్ అన్నారు. మండలంలోని శీలంవారిపల్లెలో కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల్లో గురువారం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి జీవిత విశేషాలను, ఆయన జీవిత ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. ఆదివాసీల హక్కులకోసం, దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడిన సమరయోధుడు అల్లూరి అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.కుమీర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి

టంగుటూరు: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు పేర్కొన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటంలో ప్రాణాలకు వెరవకుండా అల్లూరి సాగించిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఉప్పలపాటి సుబ్బరాజు, ఎంపీటీసీ కోటేశ్వరరావు, యరమాల వెంకట్రావు, ఉప్పలపాటి నరేష్‌వర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


అనంతవరంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

సీఎస్‌పురం(పామూరు): విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్ఓలతో బీకేవీ (బెంగుళూరు, కడప, విజయవాడ) గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌హైవే, మైదుకూరు–సింగరాయకొండ 167బీ జాతీయ రహదారిలో భూముల కోల్పోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న పరిహారం చెల్లింపులపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా మండలంలో అక్రమంగా ఆన్‌లైన్ చేసిన ప్రభుత్వ, పశువుల మేత భూముల వివరాలపై తహసీల్దార్, వీఆర్ఓలతో చర్చించారు. మండలంలోని మునునూరు రెవెన్యూ పరిధిలో ఒక రైతుకు చెందిన భూమిని మరొకరికి ఆన్‌లైన్ చేయడంపై వీఆర్ఓ డి.శ్రీనివాసులు నుంచి రాతపూర్వకంగా సంజాయిషీ తీసుకున్నారు. జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు త్వరితగతిన పరిహారం ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు, క్లెయిలకు భూముల పత్రాలను జతచేసి త్వరితగతిన పంపాలని తహసీల్దార్, వీఆర్ఓలను ఆదేశించారు. తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా, ఆర్ఐ, వీఆర్ఓలు ఉన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం


ఉలవపాడులో బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉలవపాడు: నీట్ పరీక్షా పేపర్ లీకేజీకి నిరసనగా మండల పరిధిలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. బంద్ నేపథ్యంలో ముందుగానే పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఉలవపాడులోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు మూసివేయించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పరీక్ష పేపర్ల లీకేజీ జరుగుతుందని, నీట్‌పరీక్ష రద్దు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘ నాయకులు అజయ్, సుమంత్ ఆకాష్, చందు, శివ, దేవలు పాల్గొన్నారు.

పామూరు: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్ర దర్యాప్తుచేయించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా మాజీ కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీని నిరసిస్తూ, బాధ్యులను శిక్షించాలని కోరుతూ దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా పామూరుతో పాటు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో తరగతులు బహిష్కరించి నిరసనలు తెలిపారు.

ఈసందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా మాజీ కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర విచారణ చేయించాలన్నారు. లేకుంటే నిరసనలను ఉధృతం చేస్తామన్నారు.

ఎన్‌సీసీ క్యాంపులో ప్రకాశం విద్యార్థుల ప్రతిభ

కందుకూరు: గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో జరిగిన ఏక్ భారత్–శ్రేష్ఠభారత్ ఇంటిగ్రేషన్ క్యాంపులో ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని ఏడు డైరెక్టరేట్స్ నుంచి 595 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొనగా గుంటూరు గ్రూప్‌లో ఉన్న 34(ఎ) బెటాలియన్ ఎన్‌సీసీ అండర్‌లో ఉన్న ప్రకాశం ఇంజినీరింగ్ విద్యార్థులు కె. ఆంజనేయులు, ఎ రమేష్ పాల్గొని గుంటూరు గ్రూప్‌కి ట్రోఫీని అందించారని చెప్పారు. ఆలాగే ఎన్‌సీసీ డీజీ వారు ఈ నెల 1వ తేదీ అనంతపురంలో నిర్వహించిన కఠినమైన దల్ సైనిక ఇంటర్ గ్రూపు కాంపిటీషన్ క్యాంపునకు కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్ కె. నరేంద్ర గుడారాల ఏర్పాటు, అత్యవసర పరిస్థితుల్లో ప్రాంతాల గుర్తింపు విభాగంలో ఎంపిక కావడం గర్వకారణమన్నారు. తమ విద్యార్థులు వివిధ ఎన్‌సీసీ క్యాంపులకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా క్యాంపులకు ఎంపికైన విద్యార్థులను కాలేజీలో అభినందించారు. కార్యక్రమంలో కాలేజీ ఎన్‌సీసీ నిర్వాహకులు, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, ఎన్‌సీసీ ఆఫీసర్లు షేక్ ఇమామ్‌షా, సంతోష్ పాల్గొన్నారు.

వసతి గృహాన్ని నిలిపేస్తే చర్యలు

కనిగిరి రూరల్: బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునే వసతి గృహంలో నీటి సౌకర్యం లేదనే కారణంతో విద్యార్థులను వేరే హాస్టల్‌కు తరలించడం సరైంది కాదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. స్థానిక గార్లపేట రోడ్డులోని షెడ్యూల్ కులాల బాలువ వసతి గృహాన్ని గురువారం ఆయన అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ 1979 నాటి వసతి గృహంలో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకోకుండా వసతి గృహాన్ని ఆపి వేసే ప్రక్రియను చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు. 30 మంది విద్యార్థులకు హాస్టల్‌కు సౌకర్యం కల్పించలేరా అని ప్రశ్నించారు. విద్యాశాఖ, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు దీనిపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. హాస్టల్ అధికారులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


హాస్టల్ తనిఖీలో చైర్మన్ అబ్దుల్ గఫార్

బంద్ విజయవంతం


మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు

కొండపి(సింగరాయకొండ): ఎన్ఐఏ పనితీరు, నీట్, యూజీసీ నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ గురువారం కొండపిలో విద్యార్థి సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయంతమైంది. ఈ సందర్భంగా కేజీ మస్తాన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో ఒక్కో విద్యార్థి నుంచి 30 లక్షలు వసూలు చేసి పేపర్ లీకేజ్ చేశామని బహిరంగంగా చెబుతున్నా కేంద్రం ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జూనియర్ కళాశాల విద్యార్థులతో గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వై.చంద్రశేఖర్, కోటేశ్వరమ్మ, కత్తి శ్యామ్, నాగ్, అజయ్ కుమార్, అక్షయ, సుజి, కోమలి, మల్లేశ్వరి, ప్రవలిక, భాను, ఎస్‌కే మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ కార్యవర్గం ఎన్నిక

కందుకూరు: స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో కందుకూరు పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షునిగా రావులకొల్లు వెంకటేశ్వర్లు, అధ్యక్షునిగా చిమ్మిరి నరశింహం, సెక్రటరీగా ఎంఎస్ రాంబాబు, ఇంటూరి మాల్యాద్రి, వై సత్యన్నారాయణ, చెన్నయ్య, పున్నయ్య, జీవీ కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా ఎం బైరాగిశాస్త్రి, సామాను బ్రహ్మయ్య, ఏవీ నరసమ్మ, షేక్ మహబూబ్‌బాషా, నజీర్ అహ్మద్, ట్రెజరర్‌గా పి. శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వరూపాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరావు, శంకర్‌రెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

లింగసముద్రం: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి చేయాలని బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లగుంట మోహనరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వీఆర్‌కోట, పెదపవని పరిధిలోని పాఠశాలల్లోని గురువారం బీటీఏ సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లాలో బహుజన టీచర్స్ అసోషియేషన్ సమర్థవంతంగా పనిచేస్తుందని, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ముందుంటుందని, సంఘాన్ని ఉపాధ్యాయులంతా బలోపేతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐఆర్, పీఆర్సీ, ఏపీజీఎల్ఐ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. మండల అధ్యక్ష కార్యదర్శులు పూరిమిట్ల మాధవరావు, పత్రి వెంకటరావు మాట్లాడుతూ మండలంలో నిలిచిపోయిన నాడు–నేడు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. కందుకూరు డివిజన్ కన్వీనర్ షేక్ అబ్దుల్లా, రాష్ట్ర నాయకులు దార్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదులో బీటీఏ నాయకులు

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

హనుమంతునిపాడు: రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించే పచ్చిరొట్టె విత్తనాలు మండల పరిధిలోని 14 రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు కనిగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు కేవీ రమణ అన్నారు. స్థానిక భరోసా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్టే విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు జీలుగలు, పచ్చ పెసలు, జనుములు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అసరమైన రైతులు రాయితీ సొమ్ము చెల్లించి విత్తనాలు తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా అందుబాటులో ఉంచాలన్నారు. సాగు సమయంలో అవసరమైన విత్తనాలు, ఎరువులు సరిపడా తెప్పించి రైతులకు ఇవ్వాలన్నారు. ఏఓ రమణ, ఎంపీటీసీ ఎడుముల వెంకటసుబ్బారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, రైతులు కందుల వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్ మురహరి నర్సయ్య, రామిరెడ్డి, చిన్నకోటయ్య పాల్గొన్నారు.


రైతులకు పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ వెంకటరమణ

వంగవీటి మోహనరంగాకు ఘన నివాళి

పామూరు: కాపుసంఘం నాయకులడు వంగవీటి మోహనరంగా 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు సంఘ నాయకుడు ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో పామూరులోని చిల్డ్రన్స్‌హోంలోని అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. అదే విధంగా వైద్యశాలల్లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కాపుసంఘ నాయకులు మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి రంగా ఎంతో కృషి చేశారన్నారు. ముందుగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హోం నిర్వాహకులు నేనె వేణి, ప్రసాద్, నీరుకట్టు నాయబ్‌రసూల్, పలువురు కాపుసంఘ నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.


చిల్డ్రన్స్‌హోంలో అన్నదానం చేస్తున్న కాపు సంఘ నాయకులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం: మండలంలోని అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గురువారం తెల్లవారుజామున అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి ఇసుక లోడుతో వెళుతున్న ఇసుక ట్రాక్టర్‌పై దాడి చేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు


ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న దృశ్యం


విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున ఎంఈఓలు, దాతలు

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలలకు దాతలు సాయం అందించడం అభినందనీయని, విద్యార్థులు దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈఓ ఎంవీవీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని కొత్తపాలెం ప్రాథమిక పాఠశాలకు ఎల్ఐసీ ఏజెంట్ తల్లపనేని వెంకటేశ్వర్లు సాయంతో నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, ఎక్కాల పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరారని వివరించారు. సమాజానికి మంచి పేరు, ప్రతిష్ఠలు తీసుకొచ్చే విధంగా ఉద్యోగస్తులుగా, నాయకులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పాలూరు మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులు గ్రామస్తులు సూరే వినోద్‌రెడ్డి, హరికృష్ణారెడ్డిలు మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే 50 ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని, పాఠశాలలో చదివే విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పేరెంట్స్ కమిటీ మెంబర్ గోపిరెడ్డి గోవిందరెడ్డి, గ్రామపెద్దలు వెంకట్రామిరెడ్డి, గోనుగుంట బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, విద్యాసామగ్రి పంపిణీ

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దాతల చేయూతకూడా ఎంతో అవసరమని, విద్యార్థులకు దాతలు విద్యాసామగ్రి పంపిణీ హర్షణీయమని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని సి.నాగులవరం, కోమటిగుంట్ల, చింతపూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, సి.నాగులవరం జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం ఆయా పాఠశాలల హెచ్ఎం, ఉపాధ్యాయుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాత గుంటిమడుగు శ్రీనివాసవర్మ తన సొంత నిధులతో సమకూర్చిన నోట్‌పుస్తకాలు, పలకలు, జామెట్రీ బాక్సులు, పెన్నులు, ప్యాడ్లు విద్యార్థులకు ఎంఈఓల చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు పేద విద్యార్థులకు దేవాలయం వంటివని ప్రభుత్వంతో పాటు, దాతలు సైతం పాఠశాల అభివృద్ధికి తోడ్పడి ప్రభుత్వ పాఠశాల విద్యను మరింత బలోపేతం చేసుకోవాలన్నారు. నాయకులు బి.వెంగయ్య, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరాజు, షేక్.రియాజ్‌బాషా, హస్తి వీరాంజనేయులు, షేక్.పాదుషా, యం.కిరణ్‌కుమార్, నాయకులు ఎం శ్రీనివాసులు, బొబ్బూరి రమేష్, ఎస్‌సీ మాలకొండయ్య, పునుగుపాటి రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లినికల్ ల్యాబ్‌లకు అనుమతి తప్పనిసరి



సింగరాయకొండ: రక్త పరీక్ష కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహించరాదని డీఎంహెచ్ఓ సురేష్ స్పష్టం చేశారు. మండలంలో గురువారం ఆయన రక్త పరీక్ష కేంద్రాలను, ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ అనుమతి లేకుండా ల్యాబ్‌లు, ఆస్పత్రులు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అనుమతి లేని పలు ల్యాబ్‌లను మూయించగా, మరి కొంతమంది విషయం తెలుసుకుని స్వచ్ఛందంగా మూసివేశారు. డీసీఎస్ డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ వంశీధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

కనిగిరి రూరల్: ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, కనిగిరి జూనియర్ సివిల్ జడ్జీ కె.భరత్‌చంద్ర అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. నూతన చట్టాల ద్వార కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తోందని తెలిపారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించే అవకాశం కల్పుతుందన్నారు. డీఎస్పీ రత్నాకరం రామరాజు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

